

ఏలూరు కొత్త బస్టాండ్‌లో పండుగ సెలవులకు ఊరెళ్తూ బస్సు ఎక్కేందుకు చిన్నారుల పరుగు



చింతలపూడిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో అలంకరించిన ఎడ్లబండిపై సంప్రదాయ దుస్తుల్లో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దంపతులు



ఏలూరు రూరల్ మండలం కోడేలులో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరి



కైకలూరు మండలం శృంగవరప్పాడులో బరిని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు



కొయ్యలగూడెం మండలం గవరవరంలో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరి

రెడీ.. వన్ టూ త్రీ



నెగ్గేదెవరో?

ఊరూవాడా బరులు సిద్ధం

- పందేలకు ముహూర్తం ఖరారు
- పేకాట, గుండాటకు లక్షల్లో వేలం
- చూసీ చూడకుండా ఉంటే బంపర్ ఆఫర్లు.. నిర్వాహకుల ఎత్తుగడలు
- శాఖల వారీగా శాంతింపజేసే ప్రయత్నాలు

సంక్రాంతి వచ్చిందంటే చాలు. అందరిలోనూ ఒక్కటే టెన్షన్. చిన్నాపెద్దా తేడా అసలే ఉండదు. బరులు ఎక్కడ నిర్వహిస్తున్నారు, పందేలు ఎక్కడ ఉండబోతున్నాయి, పోలీసులు ఊరుకుంటారా.. కాదంటే నాయకులు ఆగుతారా. ఈ ఏడాది ఏం జరగబోతోంది. అనుకున్నదే అవుతుందా.. పండుగ మూడు రోజులు కోళ్ల కాళ్లు దువ్వుతాయా..? లేదా..? అంతటా ఇదే టెన్షన్. అందరి నోటా సమాధానాలు లేని ప్రశ్నలే.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గతంలో పండుగ నెల పడితే చాలు ఇక ఊరువాడా సందడే సందడి. చిన్నా పెద్దా తేడా లేకుండా ఎక్కడికక్కడ కోడిపందేలు వేసుకునేవారు. పందేలు తగవంటూ పోలీసులు చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేస్తున్నట్లే కన్పించేవారు. పోలీసులదీ ఇదే పాత్ర. ఊరు వాడా పందేలు వేస్తే సహించమంటూ మైకులతో హోరెత్తించడం రీవాజు. పెద్దఎత్తున కోడికి కట్టే కత్తులు స్వాధీనం చేసుకోవడం, బైండోవర్ కేసులు పెట్టడం, పందేలపై దాడులు నిర్వహించడం, పందెం పుంజులతో సహా అరెస్ట్ చేయడం సంక్రాంతి పండుగ నాడు ఊరురా జరిగేదే. సంక్రాంతి పండుగ అంటేనే సంప్రదాయ వ్యవహారం తెరమరుగునపడి కోడిపందేలు, గుండాట, పేకాట వంటివన్నీ తెరముందుకు వచ్చాయి. సంక్రాంతి సీజనులో న్యాయస్థానం ఆదేశాల మేరకు కోడిపందేలను నిషేధిస్తున్నట్లుగా ప్రకటించడం ప్రతిసారి వస్తూనే ఉంది. ఈసారి కూడా పెద్ద ఎత్తున పందెం బరులను పోలీసులు ధ్వంసం చేశారు. రెండు వేలకు పైగా కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. రెండున్నర వేలమందికి పైగా బైండోవర్ కేసులు పెట్టారు. గీత దాటితే ఖబడ్దార్ అంటూ వార్నింగ్‌లు ఇచ్చారు.

అయినా ఆగేనా ?

పోలీసులు ఇంత చేస్తే ఎక్కడా సంక్రాంతి జోష్ తగ్గేదట్టు లేదు. ఇప్పటికే పండుగ మూడు రోజులు అనుమతులు లభించకపోయినా అన్ని నియోజకవర్గాల్లోనూ పందెలకు బరులను సిద్ధం చేస్తున్నారు. పోలీసు శాఖలో వున్న సిబ్బంది, అధికారుల సంఖ్య అత్యల్పం కాబట్టి పెద్దసంఖ్యలో వెలుస్తున్న పందెం బరులపై దాడులు చేయడం దాదాపు సవాలుగానే మారింది. సంప్రదాయ పోటీల పేరిట కొందరు పందేలకు సిద్ధం చేస్తున్నారు. తాజా సమాచారం మేరకు తెలుగుదేశం, జనసేన అనుకూలురే ఈసారి ఎక్కువగా బరుల నిర్వాహణకు దిగుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఎన్నికల్లో తెగ ఖర్చు అయింది కాబట్టి కాస్తో కూస్తో ఈ మూడు రోజుల సీజన్‌లోనే కూడబెట్టుకోవాలనే తపన స్థానిక నేతలల్లో కన్పిస్తోంది. ప్రత్యేకించి ఒక పందెం బరిని సిద్ధం చేస్తే ఆ బరి నిర్వాహణకు గాను వేలల్లో ఖర్చు అవుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం వున్నా లేకపోయినవారిని సంతృప్తి పరచాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ఆయా ప్రాంత పోలీస్‌స్టేషన్లకు, స్థానికనేతలకు, తమ వద్దకు వచ్చిన వారిని కాదనకుండా సంక్రాంతి ఆఫర్ అందేలా చూస్తారు. ఆఖరికి పోలీసులతో పాటు అనేకమందికి ఈ మూడు రోజులు కోజా (చనిపోయిన పందెం పుంజు) ఇచ్చేందుకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఈ సంక్రాంతికి భోగి రోజు సోమవారం తొమ్మిది గంటల నుంచే కోళ్ల బరిలోకి దిగేందుకు వీలుగా సిగ్నల్ రాబోతున్నట్టు ఇప్పటికే ఊరువాడ ప్రచారం సాగుతోంది. దెందులూరు, నూజివీడు, చింతలపూడి నియోజకవర్గాలు అన్నింటిల్లో బరులు పెద్దఎత్తున వెలుస్తున్నాయి.

పందేలకు ముందే వేలం పాట

ప్రతి బరిలోనూ బరి నిర్వహించే వారంతా ముందస్తుగా లోనా బయట, పేకాటకు గుండాట వంటి వాటిని నిర్వహించుకునేందుకు ఇప్పటి కే ఎక్కడికక్కడ నిర్వాహకులు రహస్యంగా వేలం నిర్వహించారు. ప్రత్యేకించి కోసాటకు ప్రతి బరిలోనూ లక్షల్లో వేలం పాడారు. గతంలో గతేడాది పెద్ద బరి అయితే రూ.80 లక్షల నుంచి రూ. కోటి వరకు, మరీ చిన్న బరులు అయితే రూ.5 లక్షల నుంచి రూ.పది లక్షలు నిర్వాహకులకు కప్పం చెల్లిం చాల్సిందే. ఎందుకంటే సంక్రాంతి మూడు రోజులు జూదానికి అడ్డే ఉండదు. పేకాట అంటే చెవి కోసుకునే వారు ఈ మూడు రోజులు కోసాట వద్దే తడ్బాడతారు. జిల్లా మొత్తం మీద సుమారు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకూ పేకాటలోనే చేతులు మారతాయి. ఇది కాకుండా చెరువుగట్టు మీద, తోటల్లోనూ అతిథి గృహాలు, హోటళ్ళ, లాడ్జిలు, అపార్ట్‌మెంట్లలో ఎడాపెడా పేకాట జోరుగా సాగబోతోంది. సాధ్యమైనంత మేర నగదు ప్రదర్శించకుండా కాయిన్ రూపంలో చెల్లింపులు జరిపేలా కొంతమంది జాగ్రత్త పడుతున్నారు. ఇక గుండాట విషయానికి వస్తే కుర్రకారంతా ఇక్కడే వాలిపోతారు. ఈ ఆట నిషేధించినా ఎవరూ ఖాతరు చేయడం లేదు.

సిద్ధం కండి.. మిత్రమా !

'ఏటా మాదిరిగానే ఈ ఏడాది కోడి పందేలు ఉంటున్నాయి. ఎవ్వరూ భయ పడవద్దు. భోగి నుంచి కనుమ వరకు అంతా రెడీ' అంటూ ఇప్పటికే అనేక మంది తమ ప్రాంతంలో వున్న మిత్రులకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు. ప్రత్యేకించి హైదరాబాద్ నుంచి తరలి వచ్చిన అతిథులే పందేల్లో పాల్గొంటారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే, వారి అనుచరులు కొన్నిచోట్ల సంప్రదాయబద్ధంగా ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి పండుగ పూట ఎవరూ అసంతృప్తి చెందకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఇన్నాళ్ల తమ చుట్టూ తిరిగిన ముఖ్య నేతలంతా నేరుగా పందెలు వేసుకోవడానికి పరోక్ష సందేశాలు ఇచ్చినట్లు కన్పిస్తోంది. కొందరైతే పందాల నిర్వాహణకు వీలుగా ప్రత్యేకంగా పాస్‌లు ఇచ్చేందుకు ప్లాన్ చేశారు. మరోవైపు పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. ఇంతకు ముందు జంగారెడ్డిగూడెం రూరల్ మండలంలో తెలంగాణ ప్రాంతానికి చెందినవారు కాల్పులకు దిగారు. ఇది పొరపాటుగా జరిగినట్లుగానే అప్పట్లో భావించినా ప్రజలు హడలెత్తిపోయారు. ఈ తరహా ఘటనలతో పాటు తాగి ఊగి రెచ్చిపోయి ఒకరినొకరు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించిన వారిని ఉపేక్షించేది లేదని పోలీసులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎక్కడికక్కడా నిఘా బృందాలు ఓ కన్నేసి ఉంచాయి.



చాట్రాయి మండలం కొత్తగూడెంలో భోగి మంటలు వేసి సంబరాలు ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

ప్రైవేటు వాహనాలపై రవాణాశాఖ కొరడా

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు వాహనాలపై కొరడా ఝులిపిస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అదనపు చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు వాహన దారులను గుర్తించి కేసులను నమోదు చేస్తున్నారు. జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు ఏలూరు ఆర్టీవో కేఎస్ఎంవీ కృష్ణారావు పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు రహదారులపై గస్తీ నిర్వహించి ప్రైవేటు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈనెల 10న 20 కేసులు నమోదు చేసి రూ.70 వేలు, 11న 10 ప్రైవేటు బస్సులపై రూ.50 వేల అపరాధరుసుం విధించారు. నిబంధనల ప్రకారం టిక్కెట్ ధరలు కాకుండా అదనపు టిక్కెట్ ధరలు వసూ లు చేసిన బస్సులకు ఈ జరిమానాలు విధించారు. ఏలూరు ఆర్టీవో కృష్ణారావు మాట్లాడుతూ ఎవ్వరైనా ప్రైవేటు వాహనదారులు నిబంధనలు అతిక్రమిం చి ప్రజల నుంచి అధిక ధరలు, సొమ్ము లు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 24 గంటలు ప్రత్యేక రవాణాశాఖ బృందాలతో ఈ తనిఖీలు చేయిస్తున్నామ న్నారు. ఈనెల 18వ తేదీ వరకూ ఈ ప్రత్యేక బృందాలు రహదారులపై 24 గంటలు తనిఖీలు జరుపుతూ ఉంటారన్నారు.

ప్రయాణికులు లేక ఏడు రైళ్లు రద్దు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేసింది. అయితే ఆ రైళ్ళకు ప్రయాణికుల నుంచి సరైన ఆదరణ లేకపోవడంతో తక్షణం ఏడు రైళ్లను రద్దు చేస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రద్దు అయిన రైళ్ళ వివరాలు ఇవే. రైల్ నంబరు 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ఈనెల 13వ తేదీ, రైల్ నంబరు 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ 14వ తేదీ, 07122 మచిలీపట్నం - తిరుపతి 13వ తేదీ, 01437 షోలాపూర్ - తిరుపతి 16వ తేదీ, 01438 తిరుపతి - షోలాపూర్ 17వ తేదీ, 07181 గుంటూరు - కొల్లాం 18వ తేదీ, 07182 కొల్లాం - గుంటూరు 20వ తేదీలలో రద్దు చేసినట్టు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు.

కలెక్టర్, ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు

ఏలూరు/ఏలూరు క్రైం జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ప్రజలందరికీ, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లాలోని ప్రజలందరూ సంక్రాంతి పండుగ వేడుకలను కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, సుభిక్షత నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

23 కేసుల్లో చోరీ సొత్తు బాధితులకు అప్పగింత

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో దొంగతనం జరిగిందంటే కుటుంబ సభ్యులతో పాటు బంధువుల్లోను ఎంతో విషాదం నింపుతుంది. అయ్యో పాపం అంటూ ఓదార్చుతారే తప్ప ఆ నగలను తిరిగి తీసుకువచ్చి అప్పగించగలిగేది పోలీసులు మాత్రమే. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ గత ఏడాది జూన్ 15న ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పలు దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన వస్తువులను తిరిగి బాధితులకు అప్పగించారు. మరో 23 కేసుల్లో దొంగతనాల కేసుల్లో దొంగలను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా ఫిర్యాదుదారులు తమ చోరీ సొత్తు పొందాలంటే కోర్టులో న్యాయవాది ద్వారా పిటీషన్ దాఖలు చేసుకుని ఆ సొత్తుకు సరిపడా షూరిటీ తీసుకుని అనుమతి ఇచ్చేలా కోర్టు ఉత్తర్వులు ఇస్తూ ఉంటారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ కాని ఎస్పీ బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆయన ప్రతి దొంగతనం కేసులో చర్యలు చేపట్టారు. ఇప్పటికూ మోటారు సైకిళ్ల దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన మోటారు సైకిళ్ల అన్నింటిని వాహన యజమాని వ్యక్తిగత పూచీకత్తుతో ఆ వాహనాలను స్టేషన్ నుంచే నేరుగా అప్పగించారు. ప్రస్తుతం జిల్లాలో 23 కేసుల్లోనే రికవరీ చేసిన చోరీ సొత్తు రెండు కేజీల రెండు వందల ఆరు గ్రాముల ఆరు వందల మిల్లీ గ్రాముల బంగారపు వస్తువులు, తొమ్మిది కేజీల నాలుగు వందల వెండి వస్తువులు, మరో లక్ష నగదును కోర్టు అనుమతులను పోలీసుశాఖయే తీసుకుని ఆదివారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నాడు వారంతా సంతోషంగా ఉండాలని ఆశించి వారి వస్తువులు వారికి అందించామన్నారు. కేవలం ఐదు వేల రూపాయల పెట్టుబడితో వైఫై సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని దీనివల్ల ఆ ఇంటి ఒక వ్యక్తి కాపలా ఉన్నట్లేనని సూచించారు. నగలను పొందిన బాధితులంతా ఆనందభాష్పాలతో ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. పెదపాడుకు చెందిన 72 ఏళ్ల మహిళ గుండా సరోజని తన బంగారపు గొలుసును చూసి తన్మయత్వంతో కంటతడి పెట్టుకుని ఎస్పీని హత్తుకుని తన వస్తువును తనకు అప్పగించారని కన్నీటి బాష్పాలతో ఆనందం తెలిపింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు, డీసీఆర్బీఎస్ఐ రాజారెడ్డి పలువురు పాల్గొన్నారు.



బాధితులకు వస్తువులను అందిస్తున్న ఎస్పీ

స్వచ్ఛ ఏలూరే లక్ష్యం : కలెక్టర్

ఏలూరుటూటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణకు పెద్దపీట వేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరంలోని రోడ్ల డివైడర్లకు కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి, ఎస్పీ శివకిషోర్, జేసీ ధాత్రిరెడ్డి పెయింటింగులు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నగర సుందరీకరణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఇష్టానుసారంగా వాల్‌పోస్టర్లను ఎక్కడపడితే అక్కడ అంటించే కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నగరం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. జేసీ మాట్లాడుతూ నగరంలో విచ్చలవిడిగా హోర్డింగులు, ఫ్లెక్సీలు, డిజిటల్ బ్యానర్లు పెడుతున్నారని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మణరావు, డీఈ రామారావు, నగర పాలక సంస్థ మేనేజర్ సీహెచ్‌వీ.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



డివైడర్లకు రంగులు వేస్తున్న ఎస్పీ శివకిశోర్, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే బడేటి చంటి

16న డీఆర్సీ సమావేశం

హాజరు కానున్న మంత్రులు నాదెండ్ల , కొలుసు

ఏలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం ఈ నెల 16న గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు పాల్గొంటారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, వివిధ సంక్షేమ పథకాలు, భూసేకరణ, ఆర్అండ్ఆర్, దీపం-2, ధాన్యం కొనుగోలు, ఇండస్ట్రియల్ పార్కులు, శాంతిభద్రతలు, పరిపాలనమైన అంశాలపై సమీక్షిస్తారు.



ధనుర్మాస మండపంలో శ్రీవారికి ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్షేత్ర ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి ఆదివారం ఉదయం జరిగిన ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా స్వామి, అమ్మవార్లను గోదాదేవితో కలసి తొళక్కు వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకారాలు చేసి క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మండపంలో మూర్తులను ఉంచి అర్చకులు, ప్రత్యేక పూజలు జరిపి హారతులు సమర్పించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

నరసింహారావుపాలెం
టీడీపీ గ్రామాధ్యక్షుడి రాజీనామా

చాట్రాయి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెం తెలుగు దేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు అందే కృష్ణ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడికి లేఖ పంపారు. పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తున్న తమకు కనీసం విలువ గౌరవం కరువైయ్యాయని, వైసీపీ నుంచి వచ్చిన వ్యక్తిని పీఏసీఎస్ అధ్యక్ష పదవికి నామినెట్ చేస్తున్నారన్నారు. గ్రామంలో వేయాల్సిన సీసీ రోడ్లు, పెండింగ్‌లోని రోడ్లు పూర్తిచేయకుండా వాటిని నిలిపివేశారని ఈ పరిణామాలు జీర్ణించుకోలేక తన అనుచరులతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు.

నగల దుకాణంలో చోరీ

రూ.2.5 కోట్ల ఆభరణాలు కొట్టేశారు

- దుకాణం వెనుకవైపు గోడ తవ్వి దొంగతనం
- పక్కా వ్యూహంతో వ్యవహరించిన దుండగులు
- సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు..
- సొమ్మసిల్లి పడిపోయిన దుకాణ యజమాని
- ఏలూరు నగరంలో కలకలం

5





మంచి చిత్రంతో సంక్రాంతికి వస్తున్నాం



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన బ్లాక్‌బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ 'సంక్రాంతికి మంచి చిత్రంతో వస్తున్నాం. నా అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు ఈ సినిమా అమితంగా నచ్చుతుంది. ఆద్యంతం నవ్వులు పంచుతుంది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని అన్నారు. 'దిల్‌రాజు, శిరీష్ గారు అద్భుతమైన మద్దతు అందించారు. మా కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రాబోతోంది. వెంకటేశ్‌గారితో హ్యాట్రిక్ విజయం అందుకోవడం ఖాయం' అని అనిల్ రావిపూడి చెప్పారు. 'అందరూ ఎంజాయ్ చేసేలా అనిల్ సినిమాను తీర్చిదిద్దాడు, సంక్రాంతికి ఘన విజయం అందించండి' అని దిల్‌రాజు కోరారు.

కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి

డైరెక్టర్ త్రినాధరావు వివాదాస్పద వ్యాఖ్యలు



నటి అన్షుపై దర్శకుడు త్రినాధరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. "మన్మథుడు' సినిమా అప్పుడు హీరోయిన్ అన్షు లడ్డూలాగా ఉండేవారు. ఆమెను చూడడానికే సినిమాకు వెళ్లేవాళ్లం. ఓ రేంజ్‌లో ఉండేవారు. కానీ అప్పటికంటే ఆమె కొంచెం సన్నబడ్డారు. తెలుగులో ఇది సరిపోదు. కొంచెం తిని పెంచమ్మా... అన్నీ కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలి అని చెప్పాను. ఫర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయ్యారు. నెక్స్ట్ టైమ్‌కు బాగా ఇంప్రూవ్ అవుతారు" అని అన్నారు. సందీప్ కిషన్ హీరోగా నటించిన 'మజాకా' చిత్రం ప్రెస్‌మీట్‌లో త్రినాధరావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో నెటిజన్లు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను గౌరవించడం తెలియని ఇలాంటి వ్యక్తులను చిత్ర పరిశ్రమ బహిష్కరించాలని కోరుతున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్నారు. అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కె.ఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 21న విడుదలవుతోంది. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. "ఈ కథ వింటున్నప్పుడే రెండు గంటల పాటు నాన్‌స్టాప్‌గా నవ్వా. ఇది కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని కూడా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇది వంద కోట్లు కొడుతుందని నమ్మకంతో ఉన్నా" అని నిర్మాత రాజేశ్ దండా చెప్పారు.

కథని నమ్మి చేసిన సినిమా



అశ్రిత్ రెడ్డి, ఆదర్శ్ పుందిర్, ప్రియాంక సింగ్, పూజిత పుందిర్ ప్రధాన పాత్రల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. వర్కింగ్ టైటిల్ 'ప్రొడక్షన్ నం1'. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వంలో వేణుబాబు.ఏ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తైంది" అని అన్నారు. "కథని నమ్మి చేసిన సినిమా ఇది" అని హీరో అశ్రిత్ రెడ్డి చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆ విషయం మరోసారి రుజువైంది

- బాబీ కొల్లి




బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ ఆదివారం విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "2023లో 'వాల్తేరు వీరయ్య'తో విజయం దక్కింది. ఈ ఏడాది సంక్రాంతికి 'డాకు మహారాజ్' విజయంతో ఈ పండగ మరింత ప్రత్యేకంగా మారింది. బాలకృష్ణ నటవిశ్వరూపం, బాబీ డియోల్ ప్రతినాయకత్వం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లాయి. మనసు పెట్టి సినిమా తీస్తే తెలుగు ప్రేక్షకులు సినిమాను గుండెల్లో పెట్టుకుంటారని మరోసారి రుజువైంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి బ్లాక్‌బస్టర్ టాక్ వస్తోంది. సక్సెస్ వేడుకలు అనంతపురంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ విజయ్‌కార్తీక్, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు.

దర్శకులకు నా క్షమాపణలు



జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడినట్లు కథానాయిక రష్మిక మందన్న సోషల్ మీడియా ద్వారా తెలిపారు. కుడి కాలుకు గాయం అయిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'గాయంతో చిత్రీకరణకు హాజరుకాలేకపోతున్నాను. నా వల్ల జరుగుతున్న జాప్యానికి చింతిస్తున్నాను. 'థామా, సికందర్, కుబేర' చిత్ర దర్శకులకు నా క్షమాపణలు. పూర్తిగా కోలుకునేందుకు ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. గాయం మానగానే తిరిగి సెట్స్‌లో అడుగుపెడతాను' అని రష్మిక తెలిపారు.







భీమవరం మండలం తాడేరులో సంక్రాంతి సంబరాల వేదిక ద్వారం

ఆరోజుల్లో సంక్రాంతి

పెద్దలు చెప్పిన ముచ్చట

తెలుగు ఇళ్లలో సంక్రాంతి పెద్ద పండుగ. గ్రామాల్లో నెల రోజుల ముందు నుంచి సందడి. పంట చేతికొచ్చే సమయం కావడంతో ఒకవైపు పొలం పనుల హడావుడి. మరోవైపు ఇళ్లలో పండుగ పనులు. ఇంట్లో శుభ్రంగా దులుపుళ్లు.. రంగులు వేయడం.. పేడతో అలకడం.. ముగ్గులు వేయడం ఒకటే హడావుడి. ధనుర్మాసం అంతా హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల సందడి, కొమ్మదాసర్ల సరదా సంభాషణలు పల్లెల్లో పనుల హైరానాలో సైతం హాయిగొలిపే సందడి. పండుగకు వారం రోజుల ముందు నుంచి కొత్త అల్లుళ్లు, కుమార్తెల రాక. పిండి వంటలు, నూతన వస్త్రాలు, కానుకల పందేరం.. ఇదంతా ఐదు దశాబ్దాల క్రితం బాగా ఆస్వాదించాం అంటున్నారు వయసులో పెద్దవారు. వారి చిన్నతనం సరదాగా గడిపిన రోజులు గుర్తుకు తెచ్చుకుని ఇప్పటి పండుగ తీరుపై పెదవి విరుస్తున్నారు. ఆ రోజులు తలుచుకుంటే ఇప్పటికే ఎంతో పరవశం అంటూ వారి మాటల్లోనే..

ఏలూరు రూరల్, నరసాపురం, చింతలపూడి, పాలకొల్లు అర్బన్, ఉండి, ఇరగవరం, పెంటపాడు ఆకివీడు, మొగల్తూరు



తాడేరులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బొమ్మలు

సంప్రదాయం.. సరదా



పేద, మధ్య తరగతి, ధనికవర్గం తేడా లేకుండా సరదాగా సంప్రదాయ బద్ధంగా ఆనందోత్సాహాలతో జరుపుకునేవారం. పండుగ మూడు రోజులు గ్రామాల్లో ఉత్సాహభరిత వాతావరణం వెల్లివిరిసేది. బంధుమిత్రులతో కలిసి జరుపుకునేవారం. నేడు పట్టణీకరణతో పల్లెసీమల్లో కూడా సంక్రాంతి సరదా తగ్గింది. పల్లెల ముఖచిత్రం మారిపోయింది. నేటికి కొంతమంది మన గొప్ప సంప్రదాయాలను కాపాడుతున్నారు. ఇటువంటి పండుగను ప్రజలంతా కలిసి జరుపుకుని సంప్రదాయాలను కాపాడుకునే విధంగా సంక్రాంతి కార్యక్రమాలు రూపొందించాలి.

జి.రాణి, వట్లూరు

పెద్ద పండుగ



సంక్రాంతి అంటే పెద్ద పండుగ అని పిలిచేవారం. కుటుంబ సభ్యుల సరదా కబుర్లు, ఆటపాటలు, పిండి వంటలతో ఆనందం పంచుకునే వారం. ప్రస్తుతం పల్లె, పట్టణాల్లో సంప్రదాయం మాటున కోడిపందేలు, పేకాట, గుండాటకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పండుగ మూడు రోజులు పల్లెసీమల్లో బంధుమిత్రులతో సరదాగా గడిపేవారం. ఇప్పుడు అంతా ఫ్యాషన్‌గా మారింది. సంస్కృతి, సంప్రదాయాలను మనం ముందు తరాల వారికి అందించాలి.

ఎం.సత్యనారాయణ, సత్రంపాడు

సంక్రాంతి అంటే.. బంధువుల పండుగ



సంక్రాంతికి ఇల్లంతా బంధువులతో సందడి. ఎక్కడ ఉన్నా పండుగకు పది రోజుల ముందుగానే స్వగ్రామాలకు వచ్చేవారు. పండుగ తర్వాత కూడా వారం రోజుల వరకు సందడి ఉండేది. ఇక కొత్త అల్లుళ్లు ఉంటే వారికి ప్రత్యేకంగా చూసుకునేవారు, అల్లుడికి కానుకలు, నూతన వస్త్రాలు పెట్టేవారు, నాలుగైదు రకరకాల వంటకాలతో భోజనం. ఇప్పుడు మాత్రం కొత్త అల్లుడికి 120 రకాల వంటలు వండి హోదా చూపించుకోవడం అనవాయితీగా మారింది. ఈ కాలంలో పండుగ అంటే అంతా ఖర్చుతో కూడినదే.

అత్మూరి వెంకట నరసయ్య, విశ్రాంత తహసీల్దార్, నరసాపురం

నెల రోజుల నుంచి హడావుడి..



సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి సరదా. చుట్టాలకు, దూర ప్రాంతాల్లో పిల్లలను రమ్మని ఉత్తరాలు రాసేవారు. ఇంటికి రంగులు, సున్నాల పనులు, నూతన వస్త్రాలు, సామాన్లు కొనుగోలు, పిండివంట హడావుడి ఉండేది. పండుగకు వారం నుంచి బంధువుల రాకపోకల సందడి. రాత్రి 12 దాటినా సరదా కబుర్లు. సాయంత్రమైతే మహిళలు పేడతో కల్లాపు వేసి ముగ్గులు పెట్టేవారు.

చెరుకూరి తాతారావు, నరసాపురం

సంప్రదాయానికి ప్రతీక



సంక్రాంతి ప్రజలందరి పండుగ. తెలుగు సంప్రదాయానికి పతీక. ఎక్కడెక్కడో పట్టణాల్లో ఉండే బంధువులు, స్నేహితులను పల్లెలకు రప్పించే పండుగ. జరిగిపోయిన ఏడాదికాలం విశేషాలను మూడు రోజులపాటు ముచ్చటించుకునే కుటుంబాల వేదిక. గ్రామాల్లో కొన్ని చోట్ల జరిగే సంప్రదాయ కోడి పందేలు కాస్తా పోటీ పందేలుగా, జూద క్రీడలుగా మార్చడం, అదిలేనిదే సంక్రాంతి ఏముందని చెప్పడం కొన్ని ప్రాంతాల్లో ఆనవాయితీగా మారుతుంది.

డోకల రాము, వెలమపేట, చింతలపూడి

రైతుల పండుగ



సంక్రాంతి అంటే రైతుల పండుగ. పంటలు చేతికి వచ్చే కాలం. తెలుగువారి సంస్కృతి, సంప్రదాయం వెల్లివెరిసే కాలం. దుక్కి దున్ని ఎద్దులను అలంకరించి హారతి ఇస్తారు. ఇంటిల్లపాది తెల్లవారుజామునే భోగిరోజు భోగి మంటలు, పాలు పొంగలి చేస్తారు. పండుగ రోజు అరిసెలు, జంతికలు ప్రత్యేకం. ఇంటిల్లిపాది కొత్త వస్త్రాలు ధరిస్తారు. కనుమ, ముక్కనుమ ప్రతీ ఇంటా జరుపుకునే ఈ సంప్రదాయంతో ఊరంతా వేడుక, గ్రామాలన్నీ పండుగమయం అవుతాయి.

యర్రంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ నామవరం

సందడే సందడి



సంక్రాంత్రి పండుగకు సందడే సందడి. పండుగకు నెల రోజుల ముందు నుంచే ఇంట్లో ఒకటే హడావుడి. అలుళ్లు, కుమార్తెల రాక పండుగ ప్రత్యేకం. అత్తవారింట అల్లుళ్లకు పిండి వంటకాలు, నూతన వస్త్రాలతో గొప్ప సరదగా ఉండేది. ఆరోజులు మరువలేము. ఇపుడు అది ఎక్కడ కనిపిస్తోంది. ఆరోజులు జ్ఞాపకాలు ఇప్పటికీ గుర్తుంటాయి. ప్రస్తుతం ఒకరోజు, రెండు రోజులే సరదా.

కొండవీటి సాంబశివరావు, చెరుకువాడ, ఉండి మండలం

ప్రయాణం కూడా సరదా



ఆరోజుల్లో సంక్రాంత్రి సెలవులు వస్తున్నాయంటే ముందుగానే ఊర్లు వెళ్లడానికి ప్రణాళికతో వుండేవాళ్లం. కిక్కిరిసిన బస్సులో ప్రయాణం చేయాల్సి వచ్చేది. ప్రయాణంలో కూడా పండుగ హడావుడితో అంత గమ్మత్తుగా వుండేవారు. ఇప్పుడు అతా ఆధునికత. ఎక్కడ వారు అక్కడే. ఊరు వెళ్లినా మోటర్‌సైకిల్, కారులో ఉదయం వెళ్లడం సాయంత్రానికి చేతులు ఊపించుకుంటూ ఇంటికి వచ్చేయడం అంతే.

గుండాబత్తుల సుబ్బారావు, ఉండి

పాడిపంటలతో పండుగే..



ఆ రోజుల్లో సంక్రాంతి పాడి పంటలతో పెద్ద పండుగే. పిల్లలు, పెద్దలు అందరూ కలసి ఆనందంగా పండుగ జరుపుకునే వాళ్లం. గ్రామాల్లో గంగిరెద్దులు, హరి దాసు కీర్తనలు, బుడ బుక్కల వేషధారణలతో కళకళలాడేవి. ఇప్పుడు గ్రామాల్లో కూడా పాశ్చాత్యపోకడలే. పని ఒత్తిడిలో పడి పండుగ కొంత సమయాన్ని కూడా కేటాయించడం లేదు. వచ్చినంత హడావుడిగా వెళ్లిపోతు న్నారు. రైతులు కూడా చేతిలో తగినంత డబ్బు లేక సంక్రాంతి పండుగను గతంలో లా జరుపుకోలేకపోతున్నారు.

నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, పెంటపాడు

సరదా.. హడావుడి



సంక్రాంతి వస్తోందంటే నెల రోజుల నుంచి సందడి.. హడావుడి. ఉండేది. ఒక వైపు వరి మాసూళ్లు, ఇళ్లకు సున్నాలు, పేడలతో అలకడం, ముగ్గులు పెట్టుకోవడం. మనవలు భోగి మంటల్లో వేయడానికి ఆవు పేడతో పిడకలు తయారుచేయడం, భోగిపళ్ల పేరంటాలు, బొమ్మల కొలువులు. అల్లుళ్ల, కూతుళ్లకు, మనవలకు కొత్తబట్టలు, పిండివంటలతో అసలు ఖాళీ ఉండేది. కాదు, నేడు ఆ వాతావరణం కనుమరుగవుతోంది. సంప్రదాయాలు ఎవరూ పట్టించుకోవడం లేదు.

గోపరాజు సీతామహాలక్ష్మి, పాలకొల్లు

నెల రోజుల ముందే ప్రణాళిక



సంక్రాంతి పండుగ వస్తుందంటే నెల రోజుల ముందు నుంచి ప్రణాళిక సిద్ధం చేసుకునేవాళ్లం. పంట చేతికొచ్చే సమయం కావడంతో డబ్బులు మసిలేవి. మాది తొమ్మిది మంది అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్లతో మాది ఉమ్మడి కుటుంబం. అన్నదమ్ముల పిల్లలు, అక్క చెల్లెళ్ల పిల్లలు అందరూ సంక్రాంతికి మొగల్తూరు వచ్చేవారు. ప్రత్యేక పిండి వంటలు తయారు చేసేవారు. నూతన దుస్తులు అందరూ కుట్టించుకునేవాళ్లం. రాజగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి నెల రోజులు నిర్వహించే సేవల్లో పాల్గొనేవాళ్లం.

- అనంతపల్లి గాంధీ, మొగల్తూరు

సంక్రాంతి పిండి వంటల్లో ఆరోగ్యం



సంక్రాంతి పండుగ అంటేనే పిండి వంటలు. కుటుంబంలో మహిళలంతా వంటకాల్లో పడితే పొరి గింటి మహిళలు సహాయపడేవారు. వాకిట్లోనే పుల్లల పొయ్యి ఏర్పాటు చేసి మగవారు గొడ్డలితో పుల్లలను నరికి ఇస్తుంటే వంటలు వండే తీరు చూడముచ్చట గా ఉండేది. సంక్రాంతి పిండి వంటలు జంతికలు, బెల్లం నువ్వులతో చేసే నువ్వు ఉండలు, మినుములతో చేసే సున్నుండల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయి. నేటి కాంలో ఇళ్లల్లో పిండి వంటకాలే జరగడంలేదు. ఇప్పుడు ఒకరోజు ముందు స్వీట్‌స్టాల్స్‌కు వెళ్లి కొనుక్కునే పరిస్థితి ఇపుడు ఉంది.

- ఆకేటి నరసింహారావు, తూర్పువిప్పర్రు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లేదు



గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలుండేవి. అందరూ కలిసి జీవించేవారు. ఆరోజుల్లో ఎక్కువ మంది సంతానం ఉండేవారు. కుటుంబ సభ్యులంతారెండు రోజులు ముందుగా భోగిమంటకు కావాల్సిన సామగ్రి సేకరించి మంటలేసేవారు. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు లేవు. తల్లిదండ్రులు ఒకచోట, పిల్లలు ఒకచోట ఉంటున్నారు. పిల్లలు ఇతర రాష్ట్రాల నుంచి రావడం గగనం. వాళ్ళు వచ్చినా కుటుంబ సభ్యులను పలకరించడం, వారితో గడిపే సమయం తక్కువ. కోడిపందేలు జూదంలా మారాయి.

- చుండూరు వెంకట సత్యనారాయణ, ఆకివీడు

పిండి వంటలు దుకాణాల్లోనే..!



ఏలూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ముందుగా గుర్తొచ్చేవి సంప్రదాయ రుచులు. పల్లెల్లో అరిసెలు, కజ్జికాయలు, పూర్ణం బూరెలు, పొంగడాలు, సున్నుండలు, జంతికలు పండుగ పిండివంటలు. ప్రస్తుతం అన్ని రకాల పిండి వంటలు దుకాణాలకే పరిమితం అయ్యాయి. అభిరుచి, ఆహా, హాయ్, స్వగృహ తదితర సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి వంటకాలను తయారుచేసి అందిస్తున్నారు. ప్రత్యేక ప్యాక్‌లు, బుట్టలు, బకెట్లతో ఎవరి స్టైల్లో ఆయా కంపెనీలు పెద్ద ఎత్తున తయారు చేసి మార్కెట్‌లోకి సిద్ధం చేశాయి. నేతి పూతరేకులు, జీడిపప్పు మిక్స్‌డ్ పూతరేకులు, బెల్లం, పంచదారతోనే వేర్వేరుగా తయారు చేశారు. గత కొంత కాలంగా మాల్‌పూరి, బొబ్బట్లు తయారీ కూడా పెద్ద ఎత్తున ఊపందుకుంది.

ఆనాటి సందడి లేదు..

పండుగకు నెల ముందు నుంచి పిండి వంటలు కుస్తీపట్టేవారు. తయారు చేయడంలో అలుపుసొలుపు లేకుండా కబుర్లుతో చకచకా చేసేవారు. ఇళ్లలో ప్రత్యేక కట్టెల పొయ్యి ఏర్పాట్లు ఉండేవి. పేడ, ముగ్గులతో పొయ్యిలను అలికి అందంగా ముస్తాబు చేసేవారు. స్వయంగా బియ్యం నానబెట్టి, దాన్ని దంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో వంటకాలు చేసేవారు. బామ్మ, అమ్మమ్మలు ఉత్సాహంగా వంటలతో మనస్సుకు అభిరుచులను పంచిపెట్టేవారు. ప్రస్తుతం అతి తక్కువ మంది ఇళ్లల్లోనే సంక్రాంతి వంటకాలు ఇళ్లలోనే చేసుకోవడం కనిపిస్తోంది. పండుగ రోజుకు ముందు హడావుడిగా బంధువులు రావడం, 3, 4 రోజులకే తిరుగుముఖ పడుతుంటంతో పిండి వంటల సంస్కృతి మూలన పడింది. సంప్రదాయంగా పెద్దలకు మూలన నువ్వులతో చేసిన అరిసెలు, పోకుండలు తదితర వంటల పెట్టడం ఆనవాయితీగా రావడంతో కొద్ది సంవత్సరాలుగా రెడీమేడ్‌గా తయారు చేసినవే ఇళ్లలోకి తెచ్చుకుని వాడుకోవాల్సి వస్తోంది. అన్ని రకాలు స్వీట్లుకలిపి పావుకేజీ, కేజీ, బుట్టలు, బాక్సుల్లో ప్యాక్‌ల చేసి అందిస్తున్నారు.

నాన్‌వెజ్ పచ్చళ్లు కూడా..

కొత్త అల్లుళ్ల నుంచి ఏది కొరత అనిపించుకోకుండా ఉండేందుకు ముందుగానే ఇళ్లల్లోనే బయట తయారు చేసిన నాన్‌వెజ్, ఇతర రకాలు పచ్చళ్లతో రుచులు ఆస్వాదనకు సమాయత్తం అవుతున్నారు. భీమవరం ప్రాంతం నుంచి అన్ని ప్రాంతాలకు రొయ్య, నాటుకోడి, మటన్, ఫిష్ తదితర రకాల పచ్చళ్లకు డిమాండ్ కూడా అమాంతంగా పెరిగింది. అక్కడి బ్రాండ్ పేరుతో లోకల్‌గా నాన్‌వెజ్ పచ్చళ్ల తయారీ కూడా పెరగడంతో సంక్రాంతి రుచుల్లో వీటికీ ప్రత్యేకత నెలకొంది. కొనుగోళ్లు పెరిగాయి.



గంగిరెద్దుకు క్యూఆర్ కోడ్!

సంప్రదాయ సంక్రాంతి పండుగ డిజిటల్ అడుగులు వేసింది. పండుగ సందడిలో స్మార్ట్‌ఫోన్ కీలకం అయింది. వస్త్రం, వంటకం, సందడి, హడావుడి అంతా ఫోన్‌లో నిక్షిప్తం అవుతోంది. గంగిరెద్దులకు ఇచ్చే కానుకలు సైతం ఫోన్‌తో డిజిటల్ చెల్లింపులు సాధారణం అయ్యాయి. గంగిరెద్దు తలపై రంగుల అలంకారాల మధ్యలో 'క్యూఆర్ కోడ్ పట్టుకుని వస్తోంది. ఏలూరులో డూడూ బసవన్నయూపీఐ స్కానర్‌తో ప్రత్యక్షమవ్వడం అందరిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఏలూరు డేటా కాంప్లెక్స్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దు కొమ్ములకు యూపీఐ స్కానర్ ఏర్పాటు చేశాడు. డూడూ బవసవన్నల విన్యాసాలతో అబ్బురపడిన వారు యూపీఐ స్కానర్‌తో కానుకలు చెల్లించారు.

ఏలూరు రూరల్, ఆంధ్రజ్యోతి

నగల దుకాణంలో చోరీ

రూ.2.5 కోట్ల ఆభరణాలు కొట్టేశారు

- దుకాణం వెనుకవైపు గోడ తవ్వి దొంగతనం
- పక్కా వ్యూహంతో వ్యవహరించిన దుండగులు
- సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు
- సొమ్మసిల్లి పడిపోయిన దుకాణ యజమాని
- ఏలూరు నగరంలో కలకలం



పోలీసు జాగిలంతో క్లూస్ టీం పరిశీలన

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి వేళ దొంగలు గోనె సంచులు పట్టుకుని రెక్కీ నిర్వహించి షాపులను పగులగొట్టి నేరం చేయడం లేదా ఆ షాపు గోడలను పలుగులతో తవ్వేసి లోపలకు ప్రవేశించి దొంగతనాలకు పాల్పడడం.. సమీపంలోనే పోలీసు వాహనం, పోలీసులు ఉండడం వంటి దృశ్యాలు సినిమాల్లో చూస్తూ ఉంటాం. అదే తరహాలో ఏలూరు నగరంలో శనివారం రాత్రి ఒక జ్యూవెలరీ షాపులో చోరీ జరిగింది. ఆ దుకాణంలో దొంగతనం తీరు వ్యాపారులనే కాదు స్థానికులను సైతం భయపడే విధంగా ఉంది.

ఏలూరు నగరంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మెయిన్ బజార్‌లో ఒక జ్యూవెలరీ షాపులో దొంగలు గోడను తవ్వి రంధ్రం పెట్టి వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. అపహరించిన నగల విలువ సుమారు రెండున్నర కోట్ల రూపాయల విలువ ఉంటాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన మానేపల్లి మారుతీ రఘురామ్ మెయిన్‌బజార్‌లో లోకేశ్వరి జ్యూయలర్స్ అండ్ బ్యాంకర్స్ వెండి, బంగారు నగల వ్యాపారం చేస్తున్నారు. మరోవైపు వెండి, బంగారపు వస్తువులను తాకట్టు పెట్టుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. షాపు ముందు ఎంతో అందంగా కనిపించిన ఆ షాపు వెనుక మాత్రం ఓ పాడుబడ్డ పురాతన భవనం. దొంగలకు అదే కలిసి వచ్చింది. బయటకు మాత్రం ప్రహరీ గోడ, ఓ చెక్క తలుపు ఉన్నాయి. దొంగలు ముందుగానే రెక్కీ నిర్వహించి ప్రణాళిక ప్రకారం ఈ దొంగతనానికి పాల్పడ్డట్లు స్పష్టమవుతుంది.

మారుతీరఘురామ్ యథావిధిగా ఈనెల 11న రాత్రి 10.30 గంటలకు షాపును కట్టివేసి తాళాలు వేసుకుని వెళ్లారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు షాపు వద్దకు వచ్చి తాళాలు, గేట్లు, తలుపులను తెరచి చూసేటప్పటికీ ఒక్కసారిగా కుప్పకూలి మారుతీ రఘురామ్ కిందపడిపోయాడు. ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకోవడంతో షాపులోపల గోడకు పెద్ద రంధ్రం ఉండడాన్ని గమనించారు. వెంటనే ఈ సమాచారాన్ని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణకు అందించారు. దీంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. క్లూస్ టీమ్, పోలీసు జాగిలాలతో పరిశీలింపచేయించారు. సుమారు పాతిక కేజీల వెండి, రెండున్నర కేజీల బంగారం అపహరణకు గురైనట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు. వెనుకవైపు ఉన్న పురాతన శిథిలం భవనం లోపలకు దొంగలు ప్రవేశించారు. భయంకరంగా ఉన్న ఆ లోపల నుంచి నాలుగు అడుగుల మందం కల్గిన గోడకు రంధ్రం పెట్టి షాపులోపలకు ప్రవేశించారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరీ నగలను పట్టుకుపోయారు.

రంగంలో దిగిన పోలీసు బృందాలు

జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక వైపు పోలీసు జాగిలం ఆ షాపులోకి ప్రవేశించి అక్కడ నుంచి షాపు వెనుకవైపు వెళ్లి రంధ్రం పెట్టిన ప్రదేశానికి వెళ్లింది. ఆ షాపు వెనుకవైపు రోడ్డు, ముందువైపు రోడ్డులో పోలీసు జాగిలం తిరిగింది. అంటే ఆ దొంగ ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు గుర్తించారు. మరోవైపు క్లూస్ టీమ్ కూడా అక్కడకు వచ్చి పలు ఆధారాలు సేకరించారు. ఏలూరు డీఎస్పీతో పాటు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ రాజశేఖర్, భీమడోలు సీఐ యుజె విల్సన్, వన్‌టౌన్ ఎస్ఐలు నాగబాబు, మదీనా బాషా, వారి సిబ్బంది రంగంలోకి దిగారు. నగల దుకాణం పరిసర ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజిలను కూడా పోలీసు బృందాలు పరిశీలిస్తాయి. పలు వ్యాపారులు అక్కడకు చేరుకుని ఆ షాపులో చోరీ సంఘటన చూసి దిగ్భ్రాంతి చెందారు. ఏలూరు నగరంలో ఈ సంఘటన వ్యాపారుల్లో తీవ్ర కలకలం సృష్టించింది.



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, దుకాణం వెనుకవైపు గోడకు రంధ్రం

మద్యానికి సొమ్ము ఇవ్వలేదని.. ఆత్మహత్య

పెదవేగి/ఏలూరు క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి సొమ్ము ఇవ్వలేదని ఒక వ్యక్తి పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. లక్ష్మీపురం గ్రామానికి చెందిన బడిపాటి రవికుమార్ మద్యానికి బానిసై సొమ్ముకోసం భార్యను వేధిస్తున్నాడు. శనివారంరాత్రి రవికుమార్ మద్యం తాగడానికి భార్య వెంకటేశ్వరమ్మను సొమ్ము అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో రవికుమార్ శనివారంరాత్రి పురుగుమందు తాగాడు. తెల్లవారుజామున వాంతులతో అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని కుటుంబీకులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. రవికుమార్(45) అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.చిరంజీవి ఆదివారం కేసు నమోదు చేశారు. చెక్కపల్లికి చెందిన మొక్కపాటి సురేష్(35) కాటేపల్లి మహేష్ దగ్గర 2021లో రూ.4లక్షలు అప్పు తీసుకున్నాడు. నగదును విడతల వారీగా చెల్లించినా మహేశ్ కొన్ని ఖాళీ చెక్కులు, నోట్లు మాత్రమే తిరిగి ఇచ్చాడు. తనవద్ద ఉన్న నోట్లు చూపి ఇంకా రూ 2లక్షలు ఇవ్వాలని సురేష్‌ను బెదిరిస్తున్నాడు. మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 22న గడ్డిమందు తాగి ఆత్మహత్నాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సీతంపేట రైల్వే గేటు సమీపంలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆదివారం ఉదయం రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు సిమెంటు రంగు పొట్టి చేతుల టీ షర్టు ధరించి ఉన్నాడు. రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కల్తీ మద్యం, సారాపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కల్తీ మద్యం, సారాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య జిల్లా ప్రజలకు సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయించినా, సారా విక్రయించినా దాడులు కొనసాగిస్తామన్నారు. ఇటీవల భీమవరంలో చెన్నై నుంచి కల్తీ మద్యం తీసుకువచ్చి ఖరీదైన మద్యం బ్రాండ్లు బ్లాక్‌డాగ్, జానీవాకర్ తదితర పేర్లతో విక్రయించారని, వీటిని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారన్నారు. అవి నకిలీ బాటిల్స్ అని గుర్తించడం జరిగిందన్నారు. ఇలాంటి ఎవరైనా కొనుగోలు చేసి తాగడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, ఎవరైనా అమ్మితే వెంటనే ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ ఆవులయ్య సెల్‌నెంబర్ 9440904025కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. జిల్లాలో బెల్లం సరఫరా చేసే వారిపై నిఘా ఉంచామని ఎవరైనా సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో బెల్లం వ్యాపారాలు వద్ద 15 రోజుల్లో ఎవరికి బెల్లం విక్రయించారో వారి వివరాలు కూడా తెలుసుకుంటున్నామన్నారు.




కామయ్యపాలెంలో సిద్ధం చేస్తున్న బరి.. బాపిరాజుగూడెంలో బరిని ధ్వంసం చేస్తున్న అధికారులు

కోడి పందేలకు బరులు సిద్ధం

కొయ్యలగూడెం/ఏలూరు రూరల్/ జీలుగుమిల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. మండలంలోని రామానుజ పురం, గవరవరం, రాజవరం, పొంగుటూరు, దిప్పకాయలపాడు, బయ్యన్నగూడెం తదితర అన్ని గ్రామాల్లో కోడి పందేలకు బరులు సిద్ధ మయ్యాయి. రెండురోజుల నుంచి పోలీసులు బరులు ధ్వంసం చేసినప్పటికి పందెం రాయు ళ్ళు మళ్లీ ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు చేయించుకుని బరులు సిద్ధం చేస్తున్నట్టు స మాచారం. దిప్పకాయలపాడులో టీడీపీ, జన సేన, వైసీపీ వేర్వేరుగా బరులు ఏర్పాటు చేసుకున్నారు. పొంగుటూరులో ఒకే పార్టీ నుంచి రెండుబరులు సిద్ధమవుతున్నాయి. పందేలు నిర్వహించుకునేందుకు మామూళ్ల భారీగా ఇస్తున్నట్టు సమాచారం. ఒకే శాఖకు మామూ ళ్ళు ఇచ్చే పద్ధతి అనవాయితీ ప్రభుత్వంలో కీలకశాఖ అయిన మరో శాఖ కూడా మామూళ్ళు ఇవ్వాలంటూ ఒత్తిళ్ళు చేస్తున్నట్లు సమాచారం. ఏలూరు రూరల్ మండలంలో కోడిపందేలకు బరులు సిద్ధం అయ్యాయి. పలుచోట్ల కూటమి, వైసీపీ నేతలు కలిసికట్టుగా బరులు సిద్ధం చేయడం గమనార్హం. కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ముందస్తు హెచ్చరికలు చేసినా రెవెన్యూ, పోలీసులు సమయం దగ్గరపడుతుండడంతో మిన్నకుండిపోయారు. జీలుగుమిల్లి మండలంలో రాచన్నగూడెం, జీలుగుమిల్లి, కామయ్యపాలెం గ్రామాల్లో బరులు సిద్ధం చేశారు. పోలీస్, రెవెన్యు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిం చడంతో పందేం రాయుళ్ల వారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

బరులు ధ్వంసం

పెదవేగి/లింగపాలెం: పెదవేగి మండలంలో పెదకడిమి, దుగ్గిరాల, జానంపేట, బాపిరాజు గూడెం, విజయరాయి, రాయన్నపాలెం, కూచింపూడి, లక్ష్మీపురం, వేగివాడ, కవ్వగుంట తదితర గ్రామాల్లో కోడి పందేల వేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పెదవేగి తహసీల్దారు ఎస్.భ్రమరాంబ, ఎస్ఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో బరులను ధ్వంసం చేస్తూ వెళ్తుండగా, ఆ వెనుకే తిరిగి బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు మునిగిపోయారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న ఆధ్వర్యంలో మఠంగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో కోడి పందేల బరులను ధ్వంసం చేశారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నందిని ఎంపిక



స్కూలు హెచ్ఎంతో విద్యార్థిని నందిని

ఏలూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-17 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్రజట్టుకు ఏలూరు కస్తూరిబా నగర పాలక సంస్థ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.నందిని ఎంపికైం దని స్కూల్ హెచ్ఎం సునీత తెలిపారు. గతేడాది అక్టోబరులో మార్టేరులో జరిగిన అంత ర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్న నందిని ప్రతిభకనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించిందన్నారు. విద్యార్థినిని స్కూలు వ్యాయామోపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రసన్న, తదితరులు అభినందించారు.

సంక్రాంతి కానుకగా ఐఆర్ ఇవ్వాలి : డీటీఎఫ్

ఏలూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకగా 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రభుత్వం ప్రకటించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్లకు అభ్యంతరకరంగా గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117 ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు చెబుతూనే, దానికి ప్రత్యామ్నాయంగా రద్దుచేసిన జీవోలోని అంశాలతో కొత్త ఉత్తర్వులకు ముసాయిదాను విడుదల చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన జీవో 53ని అమలు చేయాలన్నారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించి నూతన పేస్కేళ్ళపై నివేదికను తెప్పించుకుని అమలు చేయాలన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చింతమనేని

దెందులూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరు పొందిన అచ్చమ్మ పేరంటాలమ్మ తన నియోజకవర్గంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గాయాలగూడెంలో ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి నిర్వహించే పేరంటాలమ్మ తల్లి ఆలయ 68వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సంబంధిత పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పూజారి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు పూజారి వెంకటరత్నంనాయుడుతో పాటు కమిటీ సభ్యులు ఉన్నారు.

చినవెంకన్న సన్నిధిలో జబర్దస్త్ నటుల పూజలు



శ్రీవారి ఆలయంలో అభిమానులతో జబర్దస్త్ నటులు

ద్వారకాతిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని జబర్దస్త్, సినీనటులు ఆదివారం సందర్శించారు. గెడ్డం నవీన్, అప్పారావు, లేడీ గెటప్ వినోదిని(వినోద్) ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వారితో అభిమానులు ఫొటోలు దిగారు. ఆ సందర్భంగా గెడ్డం నవీన్ మాట్లాడుతూ దాదాపు 250 సినిమాల్లో నటించినట్టు చెప్పారు. హైందవ, చిరంజీవ సినిమాలు రానున్నాయని వివరించారు. అప్పారావు మాట్లాడుతూ సుమారు 300పైబడి సినిమాల్లో నటించానని, రెండువేల వరకు స్టేజ్ షోలలో పాల్గొన్నానన్నారు. లేడీ గెటప్‌తో ఉండే వినోద్ సైతం సినిమాల్లో నటించినట్లు వివరించారు.

ధర్మన్న ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి



ధర్మన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాఘవ

బుట్టాయగూడెం/ఏలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అమరుడైన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ దళ కమాండర్ ధర్మన్న ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ అన్నారు. ఆదివారం బుట్టాయగూడెం మండలం లంకపాకల గ్రామంలో జరిగిన ధర్మన్న వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మట్లాడుతూ 2001లో రామనర్సాపురం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ధర్మన్నను పట్టుకుని పోలీసులు కాల్చి చంపారని, ఇదే ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు పోలీసులు మరణించినట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని ధర్మన్న మెమోరియల్ హాల్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీరమణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ధర్మన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎస్.రామ్మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ.భూషణం, ఇఫ్టూ నాయకులు ముప్పిడి అబ్బులు, గణేష్, దుర్గారావు, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంట రాట్నాలమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గాశేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత.. కేసు నమోదు

35 సీసాలు స్వాధీనం

వేలేరుపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అశ్వారావుపేట మండలం నుంచి ఆటోలో తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపిన వివరాలివి.. మేడేపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో 35 మద్యం సీసాలు దొరికాయని వాటిని స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐలు ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపూడిలో గొబ్బెమ్మల చుట్టూ మహిళల ఆటపాట



మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



తాడేపల్లిగూడెంలో ఉప్పాకపాడు విద్యార్థులకు బహుమతులు అందించిన డీఎస్పీ



ధర్మారావుపేటలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సంక్రాంతి శోభ

ద్వారకాతిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమలలో మండల స్థాయిలో జరిగిన ముగ్గుల పోటీల్లో 89 టీములు వేసిన పలు రకాల ముగ్గులను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తిలకించి మాట్లాడారు. వచ్చే ఏడాది ఈ పోటీలను మరింత స్ఫూర్తితతో రూపొందిస్తామన్నారు. ముగ్గుల పోటీల్లో దొరసానిపాడుకు చెందిన నందినికి ప్రథమ బహుమతిగా పట్టు చీరను మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అందించారు. మత్తేవారిగూడెంకు చెందిన వి.ప్రియాంకకు ద్వితీయ, ఎం.నాగులపల్లికి చెందిన నాగదుర్గకు తృతీయ, గుండుగొలనుకుంటకు చెందిన వి.మంగతాయారుకు నాలుగు, ద్వారకాతిరుమలకు చెందిన వాణిదుర్గకు ఐదో బహుమతిని ఆమె అందించారు.

- భీమడోలు/ఉంగుటూరు:సంక్రాంతి పండుగను కుటుంబాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆదివారం భీమడోలు మండలం పాతూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు, ముగ్గుల పోటీలను తిలకించారు. సర్పంచ్ వెజ్జు బాలాజి నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాల పోటీల్లో పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉప్పాకపాడు విద్యార్థులను బీఈడీ ఎస్పీ.విశ్వనాథ్ సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయుడు అల్లు శ్రీను, కళా కేంద్రం నిర్వాహకులు బుద్దాల రామారావు తదితరులు పాల్గొన్నారు.
- దెందులూరు/పెదపాడు : దెందులూరులోని బీఆర్‌డీ నర్సింగ్ కాలేజీ అవరణలో సంక్రాంతి సందర్భంగా ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ మోటపర్తి రాజా,బీఆర్‌డీ నర్సింగ్ కాలేజీ కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఆదివారం కాలేజీ అవరణలో వేడుకలను నిర్వహించారు. పెదపాడు మండలం వట్లూరులోని సీతారాంపురం కాలనీలో జరిగిన సంక్రాంతి సంబరాల వేడుకల్లో జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ పాల్గొన్నారు. మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల నడుమ సంక్రాంతి పండుగను జరుపుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరారు. ఏపూరులో జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించగా ఎమ్మెల్యే చింతమనేని విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు.
- కుక్కునూరు :మండల మహిళా సమాఖ్య, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం కుక్కునూరులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు 83 మంది మహిళలు, బాలికలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ రావు మీన, వరకా శ్యామలా, ఎం.వెంకటాచారి, నాగేశ్వరరావు, కోట గిరి సత్యనారాయణ, పిచ్చుకరాజు తదితరులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం : ధర్మారావుపేట గ్రామంలో మహిళల సంక్రాంతి సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆ గ్రామ మహి ళలంతా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కొయ్యలగూడెం చింతాలమ్మ ఆలయం వద్ద సంక్రాంతి సంబరాలకు ఘనంగా ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.



కుక్కునూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



దెందులూరు ప్రగతి కాలేజీలో సంక్రాంతి సంబరాలు

రేపు ముగ్గుల పోటీలు

ఏలూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా చాటపర్రు గ్రామం గీతాకాలనీలోఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు, బాలబాలికలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కోడిపందేలు, పేకాట, తదితర చెడుక్రీడలకు ప్రజలు దూరంగా ఉండి, సంతోషంగా ఉండే విధంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టేలు పెంటయ్య తెలిపారు.

చింతలపూడిలో..

చింతలపూడి : నియోజకవర్గంలో సంక్రాంతి శోభ పేరుతో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పండుగ చేసుకున్నంత సంతోషాన్ని కలిగించిందని పలువురు కూటమి నేతలు అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దంపతుల ఆధ్వర్యంలో సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించారు. ఆదివారం పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. తొలుత అలంకరించిన ఎడ్ల బండిపై రోషన్‌కుమార్ దంపతులు ప్రాంగణానికి వచ్చి భోగి మంటలు వెలిగించగా విజయ రోషన్‌కుమార్ పాలు పొంగలి జరిపారు. ముగింపుగా సభలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, లింగపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు మాట్లాడుతూ సంక్రాంతి అంటే కోడి పందేలేనని, నాలుగు రోజులపాటు పందేలు వేసుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా చూడాలని కోరారు.

పెండింగ్ బిల్లుల
విడుదలపై హర్షం

ఏలూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వం సంక్రాంతి కానుకను అందించింది. బిల్లులు, బకాయిలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, సీపీఎస్ కంట్రిబ్యూషన్ కలిపి మొత్తం రూ.1300 కోట్లు విడుదల చేయడం పట్ల ఏపీ ఎన్జీవో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఆదివారం హర్షం ప్రకటించారు. సంక్రాంతి కానుకగా రూ.25 వేల కోట్లు పాత బకాయిలు ఉంటే రూ. 1300కోట్లు మాత్రమే విడుదల చేయటం సంతోషకరమే అయినా, ఉద్యోగులు కొంత అసంతృప్తితో ఉన్నారని, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజురవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు పేర్కొన్నారు.



స్వయం ఉపాధితో
ఆర్థికంగా ఎదగాలి

ఏలూరుటూటౌన్/ఏలూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మార్కెట్ యార్డులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కోల్ ఇండియా లిమిటెడ్ అందించిన 25 కుట్టు మిషన్లను మహిళలకు ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా పదిమందికి ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల వర్తక సంఘం అధ్యక్షులు ఉప్పలపాటి చక్రపాణి, రోటరీ క్లబ్ ప్రోగ్రాం ఛైర్మన్ రావూరి సుబ్బారావు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, దామోదరరెడ్డి, సెక్రటరీ శారద పాల్గొన్నారు.

బెల్లం వ్యాపారులకు నోటీసులు

చింతలపూడి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్లం విక్రయదారులు, దుకాణదారులు ప్రతీ 15 రోజులకు బెల్లం వ్యాపారంపై జరిగే అమ్మకాలు, కొనుగోలు వివరాలు అందజేయాలని వ్యాపారులకు నోటీసులు జారీ చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. నాటుసారా తయారీకి బెల్లం అమ్మడం నేరమని పేర్కొన్నారు. ఆదివారం బెల్లం దుకాణాలు, బ్రాందీ షాపులను తనిఖీ చేసినట్టు తెలిపారు.

వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకం



విజయరాయిలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

పెదవేగి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వివేకానందుని జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని విశ్వహిందూ పరిషత్ నాయకుడు రామనపూడి శివ అన్నారు. వివేకానందుని జయం తి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయరాయిలో వివేకానందుని విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు వేదాంతం విష్ణుప్రసాద్, నర్రా రాంబాబు, అమరవాణి, పీబీ.శ్రీనివాస్, టీడీపీ నాయకులు రావిపాటి పిచ్చియ్యచౌదరి, మంచినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

- జంగారెడ్డిగూడెం : స్వామి వివేకానంద బోధనలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆర్‌పి.రాజు అన్నారు. స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆర్.నిర్మల మాట్లాడారు. అధ్యాపకులు పవన్‌కుమార్, శాలిని, కలపాల ప్రసాద్, అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : వివేకానందుడు యువతకు ఆదర్శమని అఖిల భారత్ విద్యార్థి పరిషత్తు జిల్లా కన్వీనర్ జితేంద్ర అన్నారు. ఆదివారం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ యువజన దినోత్సవం జరిగింది. వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. గ్రామ పెద్ద బళ్ల త్రిమూర్తులు, బీజేపీ కార్యకర్తలు చిలకంటి జయరాజు, నూకల రోహిత్ నాయుడు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రాజాని సతీష్, లోకేష్, సాయిరాం రెడ్డి పాల్గొన్నారు.
- కామవరపుకోట/చింతలపూడి : స్వామి వివేకానంద జయంతి ఉత్సవాన్ని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తెలుగు టీచర్ బీరుదుగడ్డ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వ హించారు. చింతలపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. తొలుత స్వామి వివేకానందుడు చిత్రపటానికి పూలమాలను ఎమ్మెల్యే రోషన్‌కుమార్ వేశారు. టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

17న విజయవాడలో రైతాంగ సమస్యలపై ధర్నా

ఏలూరుకార్పొరేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పవరుపేటలోని అన్నేభవనంలో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరిం చారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం వాగ్దానం చేసిందని, ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ కాలం గడుస్తున్నాగాని పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందలేదన్నారు. వ్యవసాయ నష్టాలతో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకి పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కట్టా భాస్కరరావు ఉన్నారు.

ఆధ్యాత్మికం

గోకుల పారిజాత గిరిలో
కూడార్పై ఉత్సవం



రంగవల్లి మధ్యలో స్వామి వారికి నివేదించిన ప్రసాదం

జంగారెడ్డిగూడెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :జంగారెడ్డిగూడెం పట్టణంలో గోకుల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం కూడార్పై మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అందంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో అక్కారి అడిసెల్ విశేష ప్రసాదాన్ని 108కి పైగా గంగాలములలో నింపి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి నివేదనగా సమర్పించారు. అనంతరం కూడార్పై ఉత్సవం ప్రాముఖ్యతను ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు భక్తులకు వివరించారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన తరువాత భక్తులకు కూడార్పై ప్రసాదాన్ని అందించారు. గోదా శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, సోమవారం జరిగే స్వామివారి కల్యాణ కార్యక్రమానికి పసుపు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.



షాపును ప్రారంభిస్తున్న ఎంపీ మహేశ్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం : ఎంపీ

ఏలూరుటూటౌన్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు ముం దుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో అభి ఇంటీరియల్స్ మాడ్యూలర్ కిచెన్ కప్ బోర్డు పరిశ్రమను ఎమ్మెల్యే చంటితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉపాధి కల్పన ఆధునిక యంత్రపరికరాల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేస్తుందన్నారు. నిరుద్యోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణయ్య మాట్లాడుతూ సాధారణ కార్పెంటర్లు, ప్రభుత్వ సహాయంతో పరిశ్రమలు స్థాపించడం అభినందనీ యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు.

మాదిగల సభకు
తరలిరావాలి

కుక్కునూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష మంది లక్ష డప్పుల భారీ బహిరంగ సభకు తరలిరావాలని ఎంఆర్ పీఎస్ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధూ పిలుపునిచ్చారు. ఆదివారం కుక్కునూరులో ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలకు జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశ అత్యు న్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఇచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరు ఈ ఉద్యమానికి తరలివచ్చి విజయ వంతం చేయాలన్నారు. సమావేశంలో రాయి రవి, సీహెచ్.భానుప్రసాద్, శ్రీను, రాంబాబు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు,దివ్యాంగులకు అన్నదానం

పెదపాడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో వున్న అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం నిర్వహించినట్టు అన్నదాన నిర్వాహకులు రేముల గడ్డ రాము తెలిపారు. దాత గుడిపాడుకు చెందిన మోరు వడ్డీకాసులు వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించామన్నారు. అనంతరం హనుమాన్ భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమం నిర్వహించారు.







అ'పూర్వ' సమ్మేళనాలు

ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం జడ్పీ హైస్కూలులో 1992-97 సంవత్సరాల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ అధ్యాపకులు శేష, శ్రీధర్‌రాజు, రాజేశ్వరరావులను సత్కరించారు. దెందులూరు మండలం పోతు నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97 ఆర్థిక సంవత్సరంలో పదో తరగతి చదివి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వపు ఉపాధ్యాయులు సన్మానించారు. పెదపాడు మండలం పెదపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1990-91లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. ఆనాటి విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించి బహుమతులు అందజేశారు.

- ద్వారకాతిరుమల/దెందులూరు/పెదపాడు

హరిదాసులేరి...గంగిరెద్దులెక్కడ?

పల్లెల్లో తగ్గిన సంక్రాంతి సందడి



ముదినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రజలు ఆనందోత్సాహాలతో మూడు రోజుల పాటు జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి ఈ పండుగను తెలుగువాళ్లు పెద్ద పండుగ అని ముద్దుగా పిలుచుకుంటారు. పల్లె ప్రాంతాల్లో లోగిళ్లు, ఈ పండుగ రోజుల్లో కొత్త అల్లుళ్లు బంధు మిత్రులతో కళకళలాడుతుంటాయి. కొత్త దుస్తులు ధరించడం, రకరకాల పిండి వంటల తయారీ సంప్రదాయంగా ఉండేది. అయితే ఇప్పుడు ఆ పాత కాలపు సంస్కృతీ, సంప్రదాయాలు కానరాకపోవడమే కాక, కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులు రావడం కూడా తగ్గిపోయింది. గ్రామాల్లో సంక్రాంతి సందడి తగ్గింది. మద్యం ప్రియుల సందడి మాత్రమే మిగిలింది. హరిదాసులు రావడం తగ్గింది. ఒకరిద్దరు మాత్రమే గంగిరెద్దులతో తిరుగుతున్నారు.

కరువైన నాటి సరదాలు



సంక్రాంతి పండుగ సరదా కరువైంది. గతంలో పండుగ కోలాహలం గ్రామాల్లో కనిపించేది. ధనుర్మాసం పూర్తిగా హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలతో గ్రామాలు కళకళలాడేవి. బంధు మిత్రులతో పండుగ మూడు రోజులు హుషారుగా గడిపేవాళ్లం. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడ పెద్ద పండుగైన సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చి చిన్న పిల్లల్లాగా చిత్తులాటలు ఆడేవారు. ఇప్పుడు అంతా హైటెక్ సంప్రదాయాలు రావడంతో చాలా మంది వీడియో కాల్స్ చేసి పండుగ ఎలా జరుపుకుంటున్నారు అంటూ బంధువుల ను, మిత్రులను ఆరా తీస్తూ పండుగ గడిపేస్తున్నారు.

- మూకల నాగమల్లేశ్వరరావు, పెయ్యేరు, ముదినేపల్లి మండలం

పందేల బరులు సిద్ధం

ముదినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేల నిర్వహణకు మండలంలో బరులు సిద్ధమయ్యాయి. ఐదు చోట్ల పెద్ద బరులు సిద్ధం కాగా, మరికొన్ని చోట్ల చిన్న బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. ఒక వైపు పోలీసులు బరుల ధ్వంసానికి, కోడిపందేలను అడ్డుకునేందుకు హడావిడి చేస్తున్నా నిర్వాహకులు వెనుకంజ వేయడం లేదు. బొమ్మినంపాడులో రెండు, వడాలి, పెదపాలపర్రు, ముదినేపల్లి, సింగ రాయపాలెం వద్ద కోడిపందేలకు బరులు సిద్ధం చేశారు. కోడిపందేల చాటున పేకాట, గుండాట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదాలు నిర్వహణను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేస్తున్నారు.



ఆటపాకలో కోడిపందేలు వేసేందుకు సిద్ధమవుతున్న బరి

బరులు ధ్వంసం

కైకలూరు/కలిదిండి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందేలు నిర్వహణకై భారీగా ఏర్పాట్లును నిర్వహించారు. కైకలూరు మండలం ఆటపాక, రాచపట్నం, శృంగవరప్పాడు, కొట్టాడ గ్రామాల్లో పందేల బరులను ఏర్పాటు చేస్తున్నారు. బరికి చుట్టూ ఇప్పటికే కర్రలను పాతి పందేలు కాసేవాళ్ల లోపలకి రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు శృంగవరప్పాడు, ఆటపాక, తదితర గ్రామాల్లో కోడిపందేల బరులను ట్రాక్టర్లతో దున్ని చిందరవందర చేశారు. కలిదిండి మండలంలో పోతుమర్రు, గొల్లగూడెం గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలసి కోడి పందేల బరులను ధ్వంసం చేశారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

కలిదిండి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సున్నంపూడిలో శనివారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి 14 మందిని అరెస్టు చేశామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.32,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ముదినేపల్లి : చిగురుకోట పరిధిలో పేకాట శిబిరంపై ఆదివారం ఎస్‌ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో దాడి నిర్వహించి ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,500ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నందిని ఎంపిక

ఏలూరు అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-17 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్రజట్టుకు ఏలూరు కస్తూరిబా నగర పాలక సంస్థ బాలికోన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.నందిని ఎంపికైందని స్కూల్ హెచ్ఎం సునీత తెలిపారు. గతేడాది అక్టోబరులో మార్టేరులో జరిగిన అంత ర్ జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్న నందిని ప్రతిభకనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించిందన్నారు. విద్యార్థినిని స్కూలు వ్యాయామోపాధ్యాయులు మురళీకృష్ణ, ప్రసన్న, తదితరులు అభినందించారు.



స్కూలు హెచ్ఎంతో విద్యార్థిని నందిని



గోపవరంలో పూర్వ విద్యార్థులు, గురువులు

గోపవరం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం జడ్పీపాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు అనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను దుశ్శాలువాలు, పూల మాలతో సన్మానించారు. అందరు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి రూ 25వేలు నగదును ఇవ్వనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. నర్రా రవికిరణ్, ఎన్.రామకృష్ణ, కోడె రంగరావు, కోతాటి శ్రీను, కుప్పాల రంగరావు, పొలురెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.



అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్పీ

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

» జిల్లా ఎస్పీ కిశోర్

నూజివీడు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం అని ఎస్పీ కేపీఎస్.కిశోర్ అన్నారు. గొల్లపల్లి అన్నేరామకృష్ణయ్య జడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలు, 1950 - 2000 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయి కను ఆదివారం నిర్వహించారు. ఎస్పీ కిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యావదాస్తిని విద్యాభివృద్ధికి దానంగా ఇచ్చిన అన్నే రామకృష్ణయ్య సేవలను మరువలేమన్నారు. 1950 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటివరకు విద్యనభ్యసించి దేశ, విదేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉపాధిపొందిన ప్రతి ఒక్కరూ దాత చేసిన సేవలను ఆదర్శంగా తీసుకుని జన్మభూమి అభివృద్ధికి కృషిచేస్తే సమస్యలు లేని సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు అవిర్నేని వెంకటేశ్వరరావు తదితరుల కృషిని ఆయన అభినందించారు. పాఠశాల తొలిబ్యాచ్ నుంచి 200 సంవత్సరం వరకు విద్యనభ్యసించిన విద్యార్థులు తమ అనుభూతులను తోటివారితో పంచుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను కట్టిపడేశాయి.





పెదగొన్నూరు జడ్పీ హైస్కూల్‌లో, పెదలంక జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

ముదినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పెద గొన్నూరు శ్రీ కాజ లక్ష్మీనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987 బ్యాచ్ పదో తరగతి పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఆ బ్యాచ్‌కు చెందిన వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారులు, ఆక్వా రంగంలో స్థిరపడిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని 37 సంవత్సరా లనాటి జ్ఞాపకాలను, తమ అనుభవాలను గుర్తుకు తెచ్చుకుని ఆప్యాయతలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు గుడివాడ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి డిప్యూటీ మేనేజర్ గుడివాడ రాజశేఖర్, పెద ఎరుకపాడు చరణ్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మాదాసు సత్యనారాయణ, ప్రైవేట్ వైద్యుడు బండి కుటుంబరావు, మట్టా కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో సంక్రాంతి సందర్భంగా హరిదాసులను, అప్పటి హైస్కూలు లెక్కల టీచర్ నల్లగచ్చు వెంకట్రావు, అప్పటి లైబ్రేరియన్ మేకా నాగేశ్వరరావులను సత్కరించారు. మహిళలకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

పెదలంక జడ్పీ హైస్కూల్‌లో

కలిదిండి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదలంక జడ్పీ హైస్కూల్ 2013-14లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆలనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. తెలుగు రైతు ఉపాధ్యక్షులు దుగ్గిరాల పరమేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఇమ్మానేని కోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు దుగ్గిరాల అయ్యప్ప, పోకల శ్రీరామ్, అయినాల మణికంఠ, కోకా దుర్గారావు, దుగ్గిరాల శ్రీ విద్య, ఇమ్మానేని నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపి వారి జీవితాల్లో సుఖసంతోషాలు వర్ధిల్లేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. దొడ్డిపట్లలో ఆదివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ముగ్గుల పోటీల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన విజయలక్ష్మీ, రూరల్ ఎస్సై వి.రాంబాబు, సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు, మాజీ సర్పంచ్ ఆగోళ్ళు బలేస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి దేవస్థానంలో..

ముదినేపల్లి : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వడాలిలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానంలో మహిళలకు ముగ్గుల పోటీలను దేవదాయ, ధర్మదాయ శాఖ నిర్వహించింది. దేవస్థానం ప్రాంగణంలో ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. జి.వెంకటలక్ష్మి ప్రథమ, ఎ.మణిత ద్వితీయ, వై.పుష్పలత తృతీయ స్థానాలను సాధించగా, విజేతలకు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు బహుమతులు అందజేశారు.

పెదలంకలో...

కలిదిండి : పెదలంకలో ఆదివారం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు రూ.30 వేలు విలువ గల బహుమతులను అందజేశారు. వెలమ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అక్కల వెంకటాచలం, నాయకులు ముద్దం భోగేశ్వరరావు, దుగ్గిరాల చంద్రశేఖర్, దున్న భోగేశ్వరరావు, దుగ్గిరాల వీరబాబు, వీరాస్వామి, కోకా రాజు, ఎం.రంగారావు, ఇమ్మానేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు, విద్యార్థులకు క్షత్రియ పరిషత్ సహాయం



విద్యార్థులకు నగదును అందజేస్తున్న పరిషత్ సభ్యులు

కైకలూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్షత్రియ సంక్షేమ పరిషత్ ద్వారా విస్తృతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు అన్నారు. ఆదివారం కైకలూరులో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో వృద్ధులకు పెన్షన్లు, విద్యార్థులకు విద్యా అవసరాల కొరకు నగదును పంపిణీ చేశారు. సామాజికవర్గాలకు అతీతంగా 105 మంది వృద్ధులకు ఆన్‌లైన్ ద్వారా రూ.1,89,000 పెన్షన్లను అందజేశారు. ఇద్దరు మెడికల్ విద్యార్థులకు, మరో 40మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లుగా రూ.1,83,000 పంపిణీ చేశారు. నడింపల్లి మూర్తిరాజు వృద్ధులకు దుప్పట్లను, విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.2లక్షలు, ఇందుకూరి సత్యనారాయణరాజు వృద్ధులకు చీరలు, పంచెలు, రూ.200 నగదును అందించారు. నంబూరి వెంకటపతిరాజు మెడికల్ విద్యార్థికి రూ.40వేలు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. పరిషత్ సెక్రటరీ ఆర్‌వీఎస్ సూర్యనారాయణ, ట్రెజరర్ పీవి నరసింహరాజు, సభ్యులు జంపన సీతారామరాజు, దండు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో వైభవంగా సంక్రాంతి సంబరాలు





ఎడ్ల బండిపై మంత్రిని ఊరేగిస్తున్న గ్రామస్తులు, హరిదాసు గెటప్‌లో మంత్రి సారథి

చాట్రాయి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి, కమలాలక్ష్మి దంపతులు, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఎస్పీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఊరి పొలిమేర వద్ద మంత్రి దంపతులకు గ్రామస్తులు టీడీపీ శ్రేణులు గంగిరెద్దులు, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికి, పూలతో అలంకరించిన ఎడ్లబండిపై ఊరేగిస్తూ సంబరాల ప్రాంగణానికి తీసుకువచ్చారు. మంత్రి దంపతులు బోగిమంటలు వేసి సంబరాలు ప్రారంభించారు. వేడుకల ప్రాంగణంలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంస్కృతిని సాంప్రదాయాలను పెద్ద పీటవేసి సంక్రాంతి సంబరాలు ఇంత గొప్పగా నిర్వహించిన గ్రామస్తులను ఆయన అభినందించారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో చీకటి తొలిగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోసం రోజుకు 14 గంటలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. భావితరాల బంగారు భవిష్యత్తే కూటమి ప్రభుత్వ ఏకైక ఏజెండా అని అన్నారు. మన పెద్దలు మనకు అందించిన పండుగల సంస్కృతిని మన తరువాత తరానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెల్ది నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రఘునాథ్, రాజారత్నం, వివిధ గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

సీపీఐ (ఎంఎల్) డిమాండ్

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం రమణక్కపేటలో లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ మహిళలకు ఉచితబస్సు ప్రయాణం ఎప్పుడని ఆయన ప్రశ్నించారు. పాఠశాల వంట ఏజెన్సీల బకాయిలను వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అసంఘటిత కార్మికులకు నెలకు రూ.35 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రమణక్కపేట బ్లాక్‌లో అటవీభూములకు ఇచ్చిన 4 నోటిఫికేషన్‌ను తక్షనమే రద్దుచేసి, అర్హులైన పేదసాగుదారులకు పట్టాలను ఇవ్వాలన్నారు. ఆయుర్వేద ఆసుపత్రిని పునరుద్ధరించాలని, స్మశానవాటిక అక్రమణను తొలిగించాలన్నారు. పేదలకు పక్కా గృహాలను నిర్మించాలన్నారు. గత ప్రభుత్వ పాలనలాగే కూటమి ప్రభుత్వం కూడా పథకాల అమలుపై మీనమేషాలు లెక్కిస్తుందని, ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం 21మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకోగా మండల కార్యదర్శిగా వేముల బక్కయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు హరినాథ్ తెలిపారు. ఈ కార్యాక్రమంలో నాయకులు చాట్ల పుల్లారావు, ఎం.సర్వేశు, ఐసా జిల్లా కార్యాదర్శి ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలతో రైతులకు ఆర్థిక భరోసా

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మినీ గోకులాలతో పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సూరేపల్లిలో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90శాతం సబ్సిడీ అందిస్తున్నారు. ఉపాధిహామీ పథకం, పశుసంవర్థక శాఖల సంయుక్తంగా గోకులం షెడ్లను నిర్మించడం జరుగుతుందని, రైతులు 10శాతం చెల్లిస్తే చాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముళ్ళపూడి సుధారాణి, గ్రామ టీడీపీ అధ్యక్షులు మల్లిబాబు, స్థానిక నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య భద్రత ప్రభుత్వ లక్ష్యం

● నూజివీడు: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎమ్మార్ అప్పారావుకాలనీలో జీఎంహెచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎంపీ పుట్టా మహేశ్‌తో కలిసి మంత్రి పార్థసారథి ప్రారంభించారు. జనరల్, కంటి, గుండె, ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా నేత్రపరీక్షలను చేయించుకున్నారు. పేదవారికి మెరుగైన వైద్యం దూరం కాకూడదనేది ప్రభుత్వలక్ష్యమన్నారు. బడుగు, బలహీనవర్గాలకు పూర్తి ఆరోగ్యభద్రత అందించే దిశగా ఎన్టీఆర్ వైద్యసేవను అమలు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసిన జీఎంహెచ్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ పుట్టామహేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, గత నాలుగునెలల క్రితం వైద్యం చేయించుకున్న ప్రతిఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

● నూజివీడు టౌన్: భద్రతతో కూడిన ప్రయాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ఆర్టీసీ బస్సు డిపో నుంచి హైదరాబాద్, విశాఖపట్నంకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసులను ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం 1400 పైగా బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు అందుబాటులో ఉంచిందన్నారు. గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పట్టణంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో నీటి విడుదల పెంపు

ముదినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పోల్‌రాజ్ ప్రధాన పంట కాల్వ కింద ఆయకట్టులో మినుము సాగుకు పుష్కలంగా నీరందించేందుకు కృషి చేస్తున్నట్టు ముదినేపల్లి డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు తెలిపారు. హైలెవల్‌లో ఉన్న రుద్రవరం ఛానల్ పరిధిలోని మినప సాగుకు నీరందించేందుకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోల్ రాజ్ కెనాల్‌కు నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు పెంచారని తెలిపారు. ఆదివారం ఆ ఛానల్ కింద నీటి విడుదలను ఆయన రైతులతో కలసి పరిశీలించారు.

నాణ్యత పాటించండి

మండవల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో ఎటువంటి తప్పిదాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మండవల్లి సర్పంచ్ మెండా రూప్సీ సురేష్‌బాబు పేర్కొన్నారు. దళితవాడలో ఆర్సీఎం చర్చి పక్కన పంచాయతీ నుంచి రూ.లక్ష, మండల పరిషత్ నిధులు రూ.రెండు లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఆర్ఏఈ నానితో కలిసి పరిశీలించారు. సెక్రటరీ సాయి ప్రదీప్, ఇంజనీర్ అసిస్టెంట్, శ్రీరామ్, శివ, సుబ్రహ్మణ్యం, భక్తానాదం పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి వార్షిక మహోత్సవాలు

కైకలూరు, జనవరి 12: ఆచవరంలోని వేణుగోపాల స్వామి 96వ వార్షిక మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేషపూజలను నిర్వహించారు. అనంతరం 4వేలమందికి అన్నసమారాధన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏటా భోగి పండుగకు ముందు రోజు ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.

యువకుడి మృతి

ముదినేపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుడివాడ రూరల్ మండలం మోటూరు నుంచి ఆదివారం రాత్రి ముదినేపల్లికి చెందిన కగ్గా కాళీ వెంకటేష్ (16) బైక్‌పై వస్తూ ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కోడూరు రోడ్డు వద్ద తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో కిందపడిపోగా తలకు బలమైన గాయాలకు గురై మరణించాడు. ఈ ప్రమాదానికి గురైన మరో బైక్‌పై వస్తున్న యువకుడు కూచిపూడి సత్యనారాయణకు తలకు బలమైన గాయాలు కాగా, అతనిని గుడివాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానంద జయంతి

నూజివీడు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద జయంతి వేడుకలను నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షుడు మల్లిపూడి నాగరాణి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూజివీడు బాపూనగర్‌లోని రామకృష్ణ సేవాసమితి ఆవరణలో గల స్వామివివేకానంద విగ్రహానికి నాగరాణి, ఇతర బీజేపీ నాయకులు పూలమాలవేసి ఘననివాళులర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు బోసు అప్పారావు మాట్లాడుతూ వివేకానందుని బోధనలు బావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ప్రవచనాలు అజరామరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి ప్రతినిధి భాస్కర్‌జీ, బీజేపీ నాయకులు ఎం.రాజశేఖర్, మాగంటి వాసు, కంచర్ల కృష్ణ, రెడ్డి మురళీమోహన్‌రావు, రాయపాటి విజయ్‌లీలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ఆగిరిపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈదర గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేల కోసం ఏర్పాటుచేసిన బిరులను ఎస్సై శుభశేఖర్ పోలీస్‌సిబ్బందితో ధ్వంసం చేశారు. జూదం, కోడిపందేలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయ క్రీడలు నిర్వహించాలని, గ్రామస్తులకు, యువతకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సై శుభశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి.. చికిత్స పొందుతూ మృతి

ముసునూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి ఆదివారం కేసు నమోదు చేశారు. చెక్కపల్లికి చెందిన మొక్కపాటి సురేష్(35) కాటేపల్లి మహేష్ దగ్గర 2021లో రూ.4లక్షలు అప్పు తీసుకున్నాడు. నగదును విడతల వారీగా చెల్లించినా మహేశ్ కొన్ని ఖాళీ చెక్కులు, నోట్లు మాత్రమే తిరిగి ఇచ్చాడు. తనవద్ద ఉన్న నోట్లు చూపి ఇంకా రూ 2లక్షలు ఇవ్వాలని సురేష్‌ను బెదిరిస్తున్నాడు. మనస్తాపానికి గురైన సురేష్ గత నెల 22న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.